# హత్య

మినీకథ

"ఎక్స్‌క్యూజ్‌మీ..."

తలుపు తట్టబోయి ఆగిపోయాను. లోపల ఇద్దరు వాదించుకుంటున్నారు.

"శైలజని చంపడం ఏం బాగు లేదురా...తప్పుచేస్తే శిక్షించవచ్చు... చంపేయడమేనా...?"

గుండె ఝల్లుమంది. ఇదేదో హత్య కేసులావుంది. తలుపును ఆనుకుని నిశ్శబ్దంగా వినడం ప్రారంభించాను. బొంగురుగా విన్పించింది రెండోకంఠం.

"శిక్షించవచ్చు నిజమే... కాని ఆమె చేసింది మామూలు తప్పుకాదు. ఘోరమైన నేరం. కట్టుకున్న భర్త కళ్ళెదుటే భార్య మరొకరితో సంబంధం పెట్టుకుంటే అది భరించలేక ఆత్మహత్య చేసుకోవడమో, విరాగియై సన్యాసుల్లో కలసిపోవడమో చేయాలి. లేదా ఆమెను హత్యచేసి కసి తీర్చుకోవాలి. ఆఖరి పద్ధతే బాగుంది నాకు. ఆ శవం ఇప్పుడు ఆ పక్కగదిలో సోఫాలోఉంది"

"భార్యను హత్యచేసిన భర్త ఎన్ని కారణాలు చెప్పినా సమాజం సాను భూతిని పొందలేడు. హంతకునిగా అతనికి ముద్రపడక తప్పదు."

"కసితో, క్రోధాగ్నిజ్వాలల్లో రగలిపోతున్నవాడికి సమాజంతో పని లేదు. ప్రతీకారం, పగ తీర్చుకోవడం కోసం ఎటువంటి పనికైనా వెనుకాడక శైలజను వరుసగా నూరురోజులు స్లో పాయిజనింగ్ చేసి నూరవరోజున చిత్రహింసలుపెట్టి చంపేశాను. ఆ నూరురోజుల హింసలో ఆమె చేసిన పని ఎంత నికృష్టమైందో తెలియ పరచాను. దాని ప్రియుడు రాజారావ్‌ను కూడా చంపేసి ఈ కథకు ముగింపు పలుకుదామనుకుంటున్నాను."

అంటే ఈ వెధవలు మరో హత్య చెసెయ్యబోతున్నారన్నమాట. నేను వీళ్ళ పక్కవాటాలో అద్దెకువుంటూ, బి.ఇ చదువుకుంటున్నాను. వీళ్ళు ఈరోజు మధ్యాహ్నమే ఈ వాటాలోకి అద్దెకు వచ్చారు. చదువుకుంటున్న నాకు దాహం అనిపించింది. సమయానికి కూజాలో నీళ్ళులేవు. అందుకే కాస్త నీళ్ళు అడుగుదామని వెళ్ళాను. అదీ ఒకందుకు మంచిదే అయింది. హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న హంతకుడి ఉనికి తెలుసుకోగలిగాను. అందుకే వెంటనే పోలీస్ స్టేషన్‌కు పరిగెత్తాను.

అర్థరాత్రి నిద్ర చెడగొట్టినందుకు అరగంట సణుక్కున్నాడు డ్యూటీలో వున్న కానిస్టేబుల్. జరిగినది చెప్పి పోలీసుల్ని కదిలించేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది. మన పోలీస్ డిపార్ట్‌మెంటే అంతః ఖూనీ జరిగాక తాపీగా కూపీలాగుతారు గాని, దాన్ని నివారిద్దామన్న ఆలోచనే వుండదు.

మేం వెళ్ళేసరికి వాళ్ళింకా వాదించు కుంటున్నారు. పోలీసుల్ని చూసేసరికి తుళ్ళిపడ్డారిద్దరూ. అవునుమరి.. హత్య చేసేశామన్న సంబరమే తప్ప క్షణం భయంతో చస్తూ బ్రతకాలని తెలిస్తేకదా...!

సి.వి.నరసింహరాజు

"శైలజను హత్య చేసింది మీలో ఎవరు ?" గద్దించారు పోలీసులు.

సడన్‌గా వారిద్దరూ నవ్వడం ప్రారంభించారు.

"త్వరగా ఇద్దర్నీ అరెస్ట్ చేయండి సార్." అన్నాను.

"ఆగండిసార్... మీరనుకున్నట్టు మేము హంతకులం కాము. ఇతడు నా ఫ్రెండ్ భార్గవ. డిటెక్టివ్ కథలు రాస్తూంటాడు. కొత్త నవల గురించి మేమిద్దరం చర్చించుకున్నాము. అది విని మీరు అపోహపడ్డట్టున్నారు. కావాలంటే చూడండి." అంటూ టేబుల్ పైనున్న కాగితాలు మాకు చూపించాడు.



